వికలాంగులపై కూటమి కత్తి

- భారీగా తొలగించిన పింఛన్లు
- లబోదిబోమంటున్న బాధితులు
- న్యాయం చేయాలని ఎంపీడీవోలను వేడుకోలు

పలమనేరు: అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉన్న పథకాలపై కత్తిపెట్టింది. కోతలు పెడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. సామాజిక పింఛన్లను భారీగా తొలగించింది. వికలాంగులకు వస్తున్న పింఛన్లను తొలగిస్తున్నట్టు పేర్కొంటూ నోటీసులు జారీ చేసింది. ఏ పనీ చేయలేక పింఛనుతోనే జీవనం సాగిస్తున్నామని, పింఛను తొలగిస్తే ఎలా బతకాలని బాధితులు వాపోతున్నారు. న్యాయం చేయాలని ఎంపీడీవోలను ఆశ్రయిస్తున్నారు. పలమనేరు డివిజన్‌లో పలువురి పింఛన్లను తొలగించారు. సదరం సర్టిఫికెట్‌లో వైకల్యం 70 శాతానికి మించిన వారిని, డీఎంహెచ్‌వో సర్టిఫికెట్ ద్వారా వైద్యం పొందుతున్న వారికి సైతం పింఛన్లను సైతం రద్దు చేశారు. పింఛన్లు రద్దు అయిన వారు అర్హులైతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది.



ఈమె పేరు సుబ్బమ్మ. మండలంలోని గంగ్రాజుపల్లి గ్రామానికి చెందిన వారు. పోలియో కారణంగా కుడి కాలు పూర్తిగా క్షీణించింది. కర్ర సాయంతో నడుస్తోంది. ఆమెకు 95 శాతం వైకల్యం వున్నట్టు వైద్యులు సదరం సర్టిఫికెట్‌లో నమోదు చేశారు. గతంలో ఈమెకు రూ.15 వేల పింఛను వచ్చేది. మొన్నటి రీవెరిఫికేషన్‌లో వైకల్యాన్ని 80 శాతానికి తగ్గించి పింఛనును రూ.6 వేలకు తగ్గిస్తున్నట్టు నోటీసు ఇచ్చారు.



ఇతని పేరు వెంకటేష్. మరుగుజ్జు. అంతేగాక మతిస్థిమితం లేదు. మండలంలోని సాయి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతనికి గతంలో రూ.6 వేల పింఛను వచ్చేది. కూటమి ప్రభుత్వం ఇతని పింఛనును శాశ్వతంగా రద్దు చేసింది. పింఛను నగదుతోనే జీవనం సాగిస్తున్న తాను ఇప్పుడు ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. దయచేసి పింఛన్ అందించండయ్యా అంటూ కోరుతున్నాడు.

ఆరోగ్య పింఛన్ల తొలగింపు వివరాలు

మండలం	తొలగించిన పింఛన్లు	వెరిఫైడ్	రద్దు
బైరెడ్డిపల్లి	17	17	01
చౌడేపల్లి	85	85	08
గంగవరం	115	114	13
గుడిపల్లి	25	25	10
కుప్పం	18	17	03
పలమనేరు	18	18	03
పలమనేరు టౌన్	27	27	03
పెద్దపంజాణి	64	64	03
పుంగనూరు	56	56	02
పుంగనూర్ టౌన్	18	18	01
రామకుప్పం	160	151	19
రొంపిచర్ల	15	15	-
శాంతిపురం	23	23	08
సదుం	83	83	07
సోమల	117	113	12
వి.కోట	71	69	04

తొలగించిన వికలాంగ పింఛన్లు

మండలం	మొత్తం పింఛన్లు	తొలగింపులు
బైరెడ్డిపల్లి	881	101
చౌడేపల్లి	671	29
గంగవరం	1094	182
గుడిపల్లి	876	112
కుప్పం	2083	149
పలమనేరు	624	71
టౌన్	662	25
పెద్దపంజాణి	1092	84
పుంగనూరు	1032	201
టౌన్	647	99
రామకుప్పం	1052	36
రొంపిచర్ల	547	23
శాంతిపురం	1076	32
సదుం	608	72
సోమల	681	108
వి.కోట	1491	52
మొత్తం	15117	1376

పలమనేరు మండలం మత్రిమాకులపల్లికి చెందిన వై.పుష్ప వైకల్యంతో బాధపడుతోంది. ఆమె 2009లో సదరం సర్టిఫికెట్ పొందింది. అందులో వైద్యులు ఆమెకు 77 శాతం వైకల్యం వుందని తెలిపారు. దాని ఆధారంగా ఆమెకు వికలాంగ పింఛను పొందుతోంది(పింఛను ఐడీ నెం:110781693). ఆమెను అనర్హురాలిగా ప్రకటించి ఈ నెల 13న పలమనేరు ఎంపీడీవో నోటీసు జారీ చేశారు. విచారణలో భాగంగా ఆమెకు వైకల్య శాతం 40 శాతం కంటే తక్కువగా ఉందని, అందువల్లే పింఛను రద్దు చేశామని తెలిపారు. ఇలాంటి వారు ఎంతోమంది పింఛన్లను తొలగించారు.







వై.పుష్ప, 77 శాతం వైకల్యం ఉన్నట్టు ఇచ్చిన సదరం సర్టిఫికెట్, పలమనేరు ఎంపీడీవో ఇచ్చిన నోటీసు

తెరుచుకున్న ఏటీఎం సెంటర్



సదుంలో తెరుచుకున్న ఏటీఎం సెంటర్

సదుం: మండల కేంద్రమైన సదుంలో సాంకేతిక సమస్యలతో మూతబడిన ఏటీఎంకు అధికారులు బుధవారం మరమ్మతులు చేయించి తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చారు. చాలా రోజులుగా ఏటీఎం మూతపడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో సోమవారం మూతపడిన ఏటీఎం శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఏటీఎంను బాగుచేసి సేవలను పునరుద్ధరించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

పెద్దచెరువు ఆక్రమణల పరిశీలన



పలమనేరు పెద్దచెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

పలమనేరు: పట్టణంలోని పెద్ద చెరువు తూమును కొందరు అధికార పార్టీ నేతలు జేసీబీతో తొలగించారు. దీంతో చెరువులోని చేప పిల్లలు కౌండిన్య నదిపాలయ్యాయి. దీనిపై 'కౌండిన్య నదిలోకి చేప పిల్లలు' అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి స్పందించారు. వాస్తవాలను గుర్తించి మంగళవారం సంబంధిత ఇరిగేషన్, మున్సిపల్, ఫిషరీష్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో డీఆర్వో మోహన్‌కుమార్ బుధవారం పలమనేరు పట్టణంలోని పెద్ద చెరువు ఆక్రమణలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడి చెరువుకు ఆనుకుని సుమారు 280 మంది నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. దీంతో చెరువు నిండి వరదనీరు ఇళ్లలోకి వస్తోందన్నారు. చెరువులోని ఆక్రమణలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

పుంగనూరు: పట్టణంలోని నక్కబండ లో గురువారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గ్రాట్యూటీ కోసం ఎదురు చూపులు

పలమనేరు: ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఏడాదిగా గ్రాట్యూటీ చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు వైఎస్సార్ సీపీ అనుబంధ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు సోమచంద్రారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పలమనేరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో గ్రాట్యూటీ పెండింగ్ పెట్టలేదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే చెల్లించేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిగా గ్రాట్యూటీ చెల్లించకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వారి ఆర్థిక అవసరాలను గుర్తించి వెంటనే చెల్లించాలని కోరారు.

లాడ్జీలపై పోలీసుల దాడి

పలమనేరు: ఎస్‌ఐ స్వర్ణతేజ తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి పలమనేరులోని పలు లాడ్జీలపై దాడి చేశారు. లాడ్జీల్లో ఉన్న వారి ఆధార్ కార్డులను పరిశీలించారు. ఇక్కడికి ఎందుకు వచ్చారు, ఏ పని మీద వచ్చారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. లాడ్జీ నిర్వాహకులతో మాట్లాడారు. కొత్త వ్యక్తులు, లేదా పొరుగు రాష్ట్రాలకు చెందిన వారు, అనుమానాస్పదంగా వున్న వారికి గదులు ఇవ్వరాదన్నారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇటీవల ధర్మవరం, రాయచోటిలో ఉగ్రవాదుల కదలికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సదుం: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ షావలి తెలిపారు. మండల కేంద్రమైన సదుంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఒక యువతి (23) మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లేదు. దీంతో ఆమె తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పుంగనూరులో యువతి అదృశ్యం

పుంగనూరు: పుంగనూరు పట్టణానికి చెందిన యువతి (19) బుధవారం అదృశ్యమైంది. ఆమె బయటికి వెళుతున్నట్టు ఇంట్లో చెప్పింది. ఎంతకూ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ట్రైనీ ఎస్‌ఐగా చందనప్రియ



పుంగనూరు: పుంగనూరు పోలీసు స్టేషన్ ట్రైనీ ఎస్‌ఐగా చందనప్రియ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ హరిప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విధులను నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణా తరగతులు

పుంగనూరు: విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడడం అలవాటు చేసుకోవాలని ఇంగ్లీష్ స్కిల్స్ అధికారి జ్యోతి తెలిపారు. స్థానిక శుభారాం డిగ్రీ కళాశాలలో బుధవారం 30 రోజుల ఇంగ్లీష్ శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఇంగ్లీష్ మాట్లాడడంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. యువత ప్రస్తుతం ఉద్యోగాల కోసం ప్రపంచ దేశాలకు వెళుతున్నారని తెలిపారు. ఈక్రమంలో ఇంగ్లీషు భాషను నేర్చుకుంటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

చౌడేపల్లె: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్ (సీఎంవో)) మధుసూదన్‌నాయుడు తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని డి.రాజులూరు మోడల్ ప్రైమరీ పాఠశాలను తనిఖీ చేశారు. పిల్లల అభ్యసనా సామర్థ్యాన్ని, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ఎమ్మార్సీలో రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో తిరుమలమ్మ, సీఆర్‌పీ సుబ్రమణ్యం తదితరులున్నారు.

మత్తుతో జీవితాలు నాశనం

సోమల(చౌడేపల్లె): మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. ఆయన బుధవారం నంజంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువ మంది యువకులు సిగరెట్లు తాగడం, గంజాయి, హాన్స్, గుట్కా తదితర మత్తు పదార్థాలు వినియోగిస్తున్నారని తెలిపారు. వాటి బారిన పడితే బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని వివరించారు. బాగా చదువుకుని మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేష్, హెచ్‌ఎం కుసుమాంబ పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను వివరిద్దాం

పుంగనూరు: చంద్రబాబునాయుడు ప్రజలకు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్ సీపీ రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫక్రుద్దీన్ షరీఫ్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాతో కలిసి పుంగనూరు పట్టణంలోని బెస్తవీధి, నానబాలవీధి, సుభేదారు వీధిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. క్యూఆర్ కోడ్ పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరీ పార్టీలకతీతంగా పథకాలు అందించారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం తమ కార్యకర్తలకు మాత్రమే పథకాలు మంజూరు చేస్తోందని ఆరోపించారు. అరాచకాలు, అక్రమ కేసులతో పాలన కొనసాగిస్తోందని, ఇలాంటి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారని తెలిపారు. అలాగే ముస్లిం యూత్ నాయకులు అమ్ము, ఇర్ఫాన్, అస్లాంమురాధి, రఫిక్ తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి సాగిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, కౌన్సిలర్లు కిజర్‌ఖాన్, రేష్మా, జెపి.యాదవ్, కాళిదాసు, నటరాజ, భారతి, సాజిదాబేగం తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఫక్రుద్దీన్‌షరీఫ్, కిజర్‌ఖాన్

సర్పంచ్ భాగ్యవతి దంపతులకు సత్కారం

చౌడేపల్లె: మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీలో మెగా వాటర్‌షెడ్ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్న సర్పంచ్ భాగ్యవతి దంపతులను బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు ఘనంగా సత్కరించారు. 2021-2022లో గడ్డంవారిపల్లెతోపాటు మరో రెండు పంచాయతీలు మెగా వాటర్ షెడ్ పథకానికి ఎంపికయ్యాయి. కేంద్రం నుంచి వచ్చిన నిధులతో భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇవ్వడం తదితర పనులు చేపట్టారు. వాటిని కేంద్ర బృందం పలుమార్లు పరిశీలించింది. గడ్డంవారిపల్లె సర్పంచ్ భాగ్యవతి సేవలను గుర్తించి జలశక్తి అభియాన్ మంత్రి ఈ నెల 15న ఢిల్లీలో జరిగిన సాంతంత్ర్య దినోత్సవాలనికి ఆహ్వానించారు. ఈ క్రమంలో వారిని వైఎస్సార్ సీపీ నేతలు సత్కరించారు. సర్పంచ్ భాగ్యవతి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, గ్రామ, మండల నేతలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, షంషీర్, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.



సర్పంచ్ భాగ్యవతి దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించండి

గుడుపల్లె: మండలంలోని పలుగ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు, సర్పంచులు కోరారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం ఎంపీపీ వరలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు పడకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. వెయ్యి అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు పడడం లేదన్నారు. దీంతో తాగునీటి సమస్య నెలకొందని తెలిపారు. రైతులతో మాట్లాడి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సింగల్ విండో చైర్మన్ రమేష్, ఎంపీడీవో రాధాక్రిష్ణ, తహసీల్దార్ సీతారాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

చోరీపై కేసు నమోదు

సదుం: మండలలోని చీకలచేనులో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ షావలి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15న చీకలచేనుకు చెందిన సుధాకర్ ఇంటికి పీలేరు మండలం కోటపల్లెకు చెందిన విశ్వనాథం వచ్చాడన్నారు. 18వ తేదీన సుధాకర్ పొలం పనుల కోసమని కొర్లగుంటవారిపల్లెకు వెళ్లాడని తెలిపారు. ఆ సమయంలో సుధాకర్ ఇంటిలోని బీరువాలో వున్న 97 గ్రాముల బంగారు నగలను, పల్సర్ వాహనం విశ్వనాథం చోరీ చేసి వెళ్లిపోయాడన్నారు. బాధితుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

వినాయకుడి మండపాలకు అనుమతి తీసుకోవాలి

కుప్పం రూరల్/వి.కోట: వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరని కుప్పం డీఎస్పీ పార్థసారథి, వి.కోట అర్బన్ సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు చేయాలనుకునేవారు గణేష్ ఉత్సవ్.నెట్ అనే వెబ్ సైట్‌లోకి వెళ్లి ఫోన్ నంబర్ టైప్ చేయాలన్నారు. దానికి ఓటీపీ వచ్చి లాగిన అయ్యాక ఒక ఫారం వస్తుందని తెలిపారు. అందులో వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలని తెలిపారు. అది సంబంధిత పోలీసు స్టేషన్‌కు వెళ్తుందన్నారు. పోలీసులు పరిశీలించి అనుమతి ఇస్తారని చెప్పారు. మూడు రోజులు మాత్రమే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఎక్కడైనా గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినాయక చవితి కమిటీ సభ్యులతో సమావేశం

పుంగనూరు: వినాయక చవితి మండపాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం ట్రైనీ ఎస్‌ఐ చందనప్రియతో కలిసి ఈడిగపల్లెలో వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కమిటీలు బాధ్యత వహించాలని సూచించారు.

అక్షరాస్యులను చేయడమే లక్ష్యం

సదుం: మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమం లక్ష్యమని ఎంఈవో దామోదర తెలిపారు. వెలుగు కార్యాలయంలో బుధవారం వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1,890 మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. వారిని 189 మంది వలంటీర్ల ద్వారా వంద రోజుల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. క్లస్టర్ సూపర్‌వైజర్ గుణశేఖర్ రెడ్డి, ఏపీఎం హరిప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పుంగనూరు: వ్యాపారులు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం గోకుల్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, చౌడేపల్లె రోడ్డు ప్రాంతాల్లోని వాహనదారులు, వ్యాపారులకు పలు సూచనలు చేశారు. వాహనాలను రోడ్డుకు ఒకవైపే నిలపాలని, ఎక్కడ పడితే అక్కడ ఆపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అభ్యంతరాలు తెలపండి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు ప్రమీల

సదుం: ర్యాంపులు, ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడి కాయలు తోలిన రైతుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దారు ప్రమీల తెలిపారు. ఆమె బుధవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి అమ్మగారిపల్లె, కంభంవారిపల్లె, ఊటుపల్లె, పాలమందలో గ్రామసభలు నిర్వహించారు. జాబితాలోని ప్రకారం రైతుల ఖాతాలకు రాయితీ మద్దతు ధర జమ చేయనున్నట్లు చెప్పారు. అభ్యంతరాలు తెలిపితే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరిహారం ఇప్పించాలని వినతి

గుడుపల్లె: హంద్రీ నీవా కాలువ కోసం భూములు కోల్పోయిన తమకు పరిహారం ఇప్పించాలని రైతులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కోరారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువును పరిశీలించేందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న గుడుపల్లె మండలం కాడేపల్లె, ఒంటిపల్లె, శాంతిపురం మండలంలోని కర్లగట్టకు చెందిన రైతులు కలెక్టర్‌ను కలిశారు. వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ కోసం భూములు తీసుకుని ఆరేళ్లవుతున్నా పరిహారం అందలేదన్నారు. భూములు లేక, పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. స్పందించిన కలెక్టర్ మూడు రోజుల్లో పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

28న ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు

పలమనేరు/పుంగనూరు : ఈ నెల 28న ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆయన బుధవారం పలమనేరు, పుంగనూరు పార్టీ కార్యాలయాల్లో మహా సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచేస్తున్నాయని దుయ్యబట్టారు. దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో సీపీఐ రాష్ట్ర మహాసభల్లో పలు అంశాలపై చర్చిస్తామని వెల్లడించారు. పలు తీర్మానాలు చేస్తామని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామమూర్తి, మున్న, వెంకట్రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం

సదుం: ప్రజల రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో భవాని ఆదేశించారు. ఆమె బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సర్వేలతో మారిన జాయింట్ ఎల్‌పీఎంలను సింగిల్ ఎల్‌పీఎంలుగా మార్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులై ఉండి భూసమస్యల వల్ల నగదు మంజూరు కాని వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. మామిడి రైతుల గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం కొర్లకుంటవారిపల్లె వద్ద వివాదాస్పద భూములను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రమీల, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

రొంపిచెర్ల: క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన కలిగి వుండాలని టాటా ఫౌండేషన్ ప్రోగామ్ జిల్లా మేనేజర్ హేమంత్ కుమార్ తెలిపారు. రొంపిచెర్ల బాలురు, కేజీబీవీ పాఠశాలల్లో బుధవారం వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయవచ్చని చెప్పారు. అనంతరం సుమారు 650 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజాత, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధనలక్ష్మీ, టాటా ఫౌండేషన్ అధికారి ముని దామోదర్, తెలుగు వర్సిటీ విశ్రాంతి ఆచార్యులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

దోమలతో జాగ్రత్తగా ఉండాలి

పులిచెర్ల(కల్లూరు)/పుంగనూరు/సదుం/బైరెడ్డిపల్లె/రొంపిచెర్ల/పలమనేరు : చిన్న దోమ వల్ల పెద్ద ప్రమాదం పొంచి వుందని, జాగ్రత్తగా వుండాలని పలువురు డాక్టర్లు తెలిపారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికున్ గునియా తదితర జ్వరాలు ప్రబలుతాయని తెలిపారు. అజాగ్రత్తగా ఉంటే ప్రాణాపాయం కలుగుతుందని వివరించారు. పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మురుగు నీరు నిల్వ వుండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగు కాల్వల్లో నీరు దోమల లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. కార్యక్రమాల్లో పులిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ నర్సు శ్రీదేవి, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, పుంగనూరులో కొత్తపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్మయి, పూజగానిపల్లెలో డాక్టర్ పవన్‌కుమార్, సదుంలో చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్లు చరణ్, గాయత్రి, బైరెడ్డిపల్లెలో బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల వైద్యాధికారులు అరుణ్‌కుమార్, విజయ్‌చంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, కాంతమ్మ, రొంపిచెర్లలో రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు వినయ్, దినేష్ కుమార్ నాయక్, సీహెచ్‌వో అమ్మాణి, హెల్త్ ఎడ్యుకుటర్ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, పలమనేరులో పలమనేరు సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సదుంలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



పుంగనూరు : దోమల నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



పలమనేరు : ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది